# తారతమ్యం

మీనాక్షి భోగంది. ఇరవై సంవత్సరాల ఈడుకే కావలసినంత డబ్బు సంపాదించింది. తల్లికాలంలోని పెంకుటిల్లు పడగొట్టి రెండంతస్తుల మేడ వేయించింది. కొద్దిరోజుల్లోనే ఒక చిన్న కారు కొనే ప్రయత్నంలో ఉంది.

ఈ సమయంలోనే మీనాక్షికి తన వృత్తిమీద అసహ్యం కలిగింది. ఈవిధంగా ఎంతకాలం జీవితాన్ని గడిపేటట్లు? డబ్బుకోసం ఎంత నటన చూపించాలి? రోజు రోజుకూ మొగాళ్ళు మారుతూనే ఉంటారు. వొక్క-రాత్రి ఆరుగురు మొగాళ్లు మారిన సమయాలుగూడా లేకపోలేదు.

మీనాక్షికి ఇప్పుడు సంసారస్త్రీల పైకి మనసు మళ్ళింది. వాళ్ళలాగా చక్క-గా (?) సంసారంచేస్తూ బిడ్డా పాపలతో కళకళ్ళాడాలని మీనాక్షి కోరిక. తను ఎంత 'ప్రేమ' చూపినా అదంతా 'భోగంతళుకు' కిందనే జమ కట్టబడుతోంది. తన జీవితానికి గమ్యస్థాన మేమిటి? ఎంత దూరం తనీవిధంగా ప్రయాణించాలి? చివరికి మిగిలేదేమిటి?

మీనాక్షికి కొంత ఆలోచించిన తరవాత తనకోరిక అసంభవమైందిగా కనిపించింది. మీనాక్షి భోగంది. పధ్నాలుగోఏటనే వృత్తిలోకి దిగింది. ఈ ఆరుసంవత్సరాల కాలంలోనూ కొన్నివందలమంది మీనాక్షిని అనుభవించారు. ఆసంగతి ఎంతోమందికి తెలుసు. ఇప్పుడీ మీనాక్షికి నిజంగా హృదయపరివర్తనం కలిగి 'పెళ్ళి' చేసుకోవడానికి

తయారయిందే అనుకోండి; అయితే మీనాక్షిని చేసుకోవడానికి వొచ్చేవాడెవడు? అంతసంస్కారం కలిగినవాడు దొరకడం చాలాకష్టం. కాకపోతే "వుంచు" కొంటారు. "పెళ్ళి" అనే పేరుమీద గాకుండా 'చేరదీస్తారు'.

మీనాక్షికి ఇవినచ్చవు. వుంచుకొనేవాళ్లు (పర్మనెంటుగా) చాలామంది వున్నారు చేరదీసేవాళ్లు గూడా చాలామందే వున్నారుకానీ, మీనాక్షికి కావలసింది భర్త. రోజురోజుకూ ఈ సమస్యతో మీనాక్షి కొట్టాడుతూవుంది.

## 2

అయితే మీనాక్షి కోరిక అసంభవమైంది కాలేదు. నాగేంద్రం మీనాక్షిని పెళ్ళిచేసుకోడానికి అంగీకరించాడు.

నాగేంద్రానికి పాతికసంవత్సరాల వయస్సుంటుంది. తల్లిచిన్నప్పుడే చచ్చింది. తండ్రి నాగేంద్రం ఇంటర్ చదువుతున్నప్పుడు చచ్చాడు. ఆస్తిపాస్తులేమీ లేవు. ఏదో దేశవాళీ కంపెనీలో నెలకు యాభయ్ రూపాయలు తెచ్చుకొంటున్నాడు. నెలకు బొటాబొటీగా సరిపోతుంది. నాగేంద్రంభార్య నీళ్ళాడలేక చచ్చిపోయి నాలుగు సంవత్సరాలైంది. ఇంతకాలం అతను పరాయి ఆడవాళ్ళను వాడుకొన్నాడు. అయిదునెలలు ఒక బ్రాహ్మణవిధవను 'వంట' కోసం అట్టేపెట్టుకొన్నాడు. ఈలోపల శ్రీమతిగారికి గర్భం వొచ్చింది. ఆవిడ "జీతంచాలక" నాగేంద్రంనుండి వెళ్ళి

పోయింది. మొత్తంమీద నాగేంద్రం ఇతరత్రా చాలా ఖర్చు పెడుతుంటాడు.

మీనాక్షి అతన్ని పెళ్ళిచేసుకోడానికి మనస్ఫూర్తిగా అంగీకరించింది. అప్పుడే ఆవిడదృష్టిలో పతివ్రతలు మెరవ సాగారు. ముఖ్యంగా చింతామణి వగైరాలు. మీనాక్షీ ఈకోరిక తల్లికి సుతరాము నచ్చలేదు ఆ కసినంతా నాగేంద్రంమీదికి సమీకరించింది. "నిన్ను పోలీసులకు పట్టిస్తా" నంది. "ఇంతకంటే మరేం గతిలేదూ?" అంది. కూతురుతో పూచికపుల్లగూడా అంటుకోనివ్వనని నిష్కర్షగాచెప్పింది.

ఈ బెదరింపులకు ఏ ఒక్కరూ జంకలేదు. కట్టుగుడ్డలతో పదిరూపాయలతో (ఇవి మాత్రం రాత్రి జట్కా పిరియుడు ఇచ్చాడు) నాగేంద్రం వెంట బయలుదేరింది.

ఆనాటిరాత్రి హోటల్‌నించి కారేజి తెప్పించాడు నాగేంద్రం. మీనాక్షి ముందు నాగేంద్రానికి వొడ్డించింది.

"నీవూ కూచో మీనూ" అన్నాడు నాగేంద్రం.

ఆ స్వరంలో నిండారిన ప్రేమధ్వనులు వినిపించినయ్ మీనాక్షికి. మీనాక్షిగుండెలు గగుర్పొడిచినయ్. వొళ్ళు జలదరించింది..

"మీరు కానివ్వండి......తరవాత కూచుంటాను" అంది. అని తను పతిభక్తిని బాగా అలవాటు చేసుకొంటున్నాననుకొంది. ఇదివరకు చాలామంది విటులు నాగేంద్రం లాగే అన్నారు. కానీ వాళ్ళమాటలకు నాగేంద్రం మాటలకు కొంతభేదాన్ని అస్పష్టంగా చూడగలిగింది మీనాక్షి. నాగేంద్రం భోంచేసి వొక్కపలుకు నములుతూ కుర్చీలో

కూచున్నాడు. మీనాక్షికి రెండవ ఆకులో భోంచేయ బుద్ధి పుట్టలేదు. నాగేంద్రం కెలికి కెలికిపోయిన ఎంగిలాకులోనే తనూ తింది రోజూ తనుతినే అన్నానికీ దీనికీ చాలా భేదమున్నట్లుగా మీనాక్షికి తోచింది.

రెండో ఆట సినిమాకు పోయివొచ్చేసరికి బాగా పొద్దు బోయింది. అందులో నాగేంద్రం పగలల్లా ఆఫీసులో (ఆఫీసులోనని అతనే చెబుతుంటాడు. కాదనుకొన్నా ఈ రచయితకు అట్టే ఇబ్బందిలేదు. కానీ నెలకు 50రూపాయలు మాత్రం తెస్తుంటాడు. అంతవరకు గ్యారంటీ) పనిచేయడం వల్ల అలిసిపొయ్యాడు. మీనాక్షి చప్పున గ్రహించింది. తెల్లారగట్లదాకా అతని కాళ్లు పిసికింది.

## 3

నాగేంద్రం ఇంతవరకూ వున్నది వొక కొద్దిపాటి గదిలో. అందులో రెండే మంచాలు. ఒక బీరువా, కొద్దిపాటి సామానుఉంది. ఇదివరకు నాగేంద్రం నెలవారీగా హోటల్లో భోంచేస్తుండేవాడు. మీనాక్షి వొచ్చినప్పటినుండీ హోటలు కెళ్ళడం మానుకొన్నాడు. అయితే ఇద్దరికీ సరిపడేలాగా క్యారియరు వస్తుంటుంది. ఒకనాటి రాత్రి నాగేంద్రం తీరిగ్గా పడుకొని (ఆసమయంలో మీనాక్షి ఇంకో మంచం మీద నిద్రపోతూవుంది) తను నెలవొకటికి హోటలుకి ఎంత చెల్లిస్తున్నదీ లెక్కగట్టాడు. సొంతంగా వంటబెట్టేపక్షంలో హోటలుకు చెల్లించే డబ్బులో ఐదింట మూడువంతులకే అంతకంటే మంచిభోజనం దొరుకుతుందని అంచనా వేశాడు.

అయితే వంటకు ఈ యిల్లు చాలదు. కాబట్టి వేరేయిల్లు తీసుకోవాలి. ఆ లెక్కప్రకారం చూసినా వంటపెట్టడమే మంచిదిగా కనిపించింది నాగేంద్రానికి.

ఆ తెల్లవారే మీనాక్షితో ఈ సంగతి చెప్పాడు.

"నాకు వండడం చాతగాదండీ" అంది మీనాక్షి. నిజంగా మీనాక్షికి వండడం చాతగాదు. చిన్నతనంలో తల్లి వండేది. మొన్నటిదాకా పనిమనిషి వండేది. కాబట్టి వంటవిషయం తెలుసుకోవలసిన అవసరం మీనాక్షికి ఇంత క్రితం కలగలేదు. కానీ ఇదివరకుదారి వేరు, ఇప్పటిదారి వేరు. అందులో వారికి హోటలుకూడు సరిపడకనే ఈమాట అన్నారేమో! ఈ సందేహం మీనాక్షిమీద బాగా పని జేసింది. వొండడానికి అంగీకరించింది. వొకటిరెండు రోజుల్లో అంతే అద్దెలో యింకో యిల్లు మాట్లాడాడు నాగేంద్రం. మీనాక్షి ఆ యిల్లు చూచి సంతోషించింది.

ఒకనాడు మీనాక్షి నాగేంద్రాన్ని కొద్దిగా చిల్లర డబ్బులడిగింది. "ఎందుకూ?" అన్నాడు నాగేంద్రం.

"సబ్బు కొనుక్కోవాలి... అయిపోయి రెండు రోజు లయింది" అంది మీనాక్షి. మీనాక్షి అతన్నిడబ్బులడగటం అదే తొలిసారి.

"సబ్బులేకపోతే స్నానంచేయగూడదాఏం?" అన్నాడు నాగేంద్రం. "మనం లక్షాధికారులంగాము. కనీసం గొప్ప ఉద్యోగమన్నా లేదు. యాభయ్ రూపాయలు ఎన్నింటికని వొస్తయ్?" అన్నాడు. అప్పటినుండి మీనాక్షి సబ్బుతో స్నానంచేసిన పాపాన పోలేదు.

# 4

తొలిరోజుల్లో నాగేంద్రం కొన్న నాలుగు చీరెలు చినిగిపోయినయ్. అప్పటికీ మీనాక్షి ఈసంవత్సరమల్లా వాటిని పొందికగా వాడింది. సాధ్యమయినంతవరకూ వాటిని సూదీదారంతో సంస్కరించింది. అయినా అలవిగానిస్థితిలోకి దిగజారినయ్ ఆ చీరెలు. అసలు చిరుగుముఖం పట్టినపుడే కొత్తచీరెలను గురించి ఒకటి రెండు సార్లు నాగేంద్రాన్ని హెచ్చరించింది. అతగాడు ఈ నెలనీ... ఆపైనెలనీ జరుపుతూ వొచ్చాడు. ఇక కొత్తచీరెలు కొనందే లాభంవుండ దని తెలిపోయినరోజున ఆమె నాగేంద్రానికి ఈ విష యమై గట్టిగా చెప్పింది.

"యాభయ్ రూపాయల్లో ఎన్నని సర్దగలను? ఇంకా నయం, ఏ పాతన్నా నీకు సొంతంగా వున్నయ్. ఇప్పుడు నేను వేసుకొంటున్న గుడ్డలు వొకానొక స్నేహితుడు ధర్మం చేశాడు... వొచ్చే నెలలో చూద్దాంలే" అన్నాడు నాగేంద్రం.

న్యాయంగా అయితే ఆ గుడ్డలు మరోవారంరోజు లయినా శరీరాన్ని కాపాడే స్థితిలో లేవు. ఆ సంగతి నాగేంద్రానికి తెలుసు. కానీ ఏం చేస్తాడూపాపం! యాభయ్ రూపాయల గుమాస్తా పురుగాయె!!

చీరలనుగురించి యిబ్బందిపడడం మీనాక్షిజీవితంలో యిదే మొదలు. మీనాక్షికి చిన్నతనంలోనే పాతిక జత లుండేవి. మీనాక్షికి కన్నెరికం బెట్టిన చౌదరయ్యా పాతిక చీరెలు తెచ్చాడు—నూలువి, సిల్కువి కలిపి. ఆ తరువాత మీనాక్షి సంపాదించినవి మూడు బీరువాలనిండావున్నయ్.

ఏ విషమసమయంలో గూడా యిస్త్రీబట్టను రెండురోజుల కంటే మీనాక్షి ఎక్కువకాలం కట్టలేదు. అయితే మీనాక్షి యిస్త్రీ బట్టలు కట్టడం మానుకొని ఆరునెలలు కావొచ్చింది ఇప్పటికి. బస్తీలో చాకలివాళ్ళు దొంగవెధవలని నాగేంద్రం చెప్పడంచేత మీనాక్షి తన గుడ్డలను—నాగేంద్రంవాటితో సహా స్వయంగా వుతికేది వాళ్ళని నమ్మలేక.

ఈ సంగతులన్నీ మీనాక్షికి తెలియకపోలేదు. అయినా అది 'కులట' జీవితం; ఇది 'సంసారి' జీవితం. ఎన్నో ఢక్కామొక్కీలు తింటేగాని ఈ రెండవదాంట్లో నిభాయించడం కష్టం. చెడును సంపాదించుకోడానికి కొన్ని నిమిషాలు చాలు. కానీ ఆ చెడును నిర్మూలించి ఆ స్థానంలో మంచిని వుంచాలంటే ఎన్నో సంవత్సరాలు కావాలి. ఈ లోపుగా ఆ వ్యక్తి ఎన్నో అగ్నిపరీక్షలకు తట్టుకోవలసి వుంటుంది. అప్పటికిగాని సత్ఫలితం కలగదు. ఈ విషయాలన్నీ మీనాక్షికి తెలిసింతరువాత చీరలనుగురించి ఆమె అంత గట్టిగా ఎప్పుడూ అడగలేదు.

## 5

ఇప్పుడు మీనాక్షి కడుపుతో వుంది. ఇంటిపని చేయలేక నానాఅవస్త పడుతోంది.

"ఈ నెలరోజులు ఒక పనిమనిషిని కుదర్చండి. నేను చేయలేకుండావున్నాను" అంది మీనాక్షి.

"ఎన్నింటికని చావను? అందులో ఈనెలనుండీ ఇంటి అద్దె అయిదురూపాయ లెక్కువయింది. నీకంటే ముందే నా

కీ పూహా తట్టింది. ఈనెల మొదటే ఒక పనిమనిషిని మాట్లా డాను. అద్దె పెరగడంచేత దాన్ని మానుకోమని చెప్పాలి సొచ్చింది. యాభై రూపాయల్లో ఎన్నని సర్దను?'' అన్నాడు నాగేంద్రం.

మీనాక్షి కిప్పుడు ఆరో నెల. అయినా ఇంటిచాకి రంతా చేస్తూనేవుంది. దానికితోడు ఏదో నలత వొంట్లో ప్రవేశించింది. అయినప్పటికీ వాళ్ళింట్లోవున్న రెండుమంచా ల్లోనూ ఒకదానికి బూజుపట్టింది. దాన్ని ఈ సంవత్సరంన్నర కాలంలోనూ ఏ పది దఫాలోకంటే ఎక్కువ వాడలేదు.

ఒకనాటిరాత్రి మీనాక్షి అర్ధజాముదాకా మూలిగి అప్పుడే కునుకుదీసింది. అంతవరకూ నిద్రబట్టక తన్నుకొం టున్న నాగేంద్రం అప్పుడే కునుకుపట్టిన మీనాక్షిని తనవేపు తిప్పుకొన్నాడు. గట్టిగా తనకు ఆనించుకుని నొక్కుకొన్నాడు. మీనాక్షికి మెలకువ వొచ్చింది. అభ్యంతరం చెప్పింది. 'వొంట్లో సరిగాలేదు' అన్నది. కడుపువేపుచూపి బతిమా లింది. వోపికనంతా కూడగట్టి ఎదురుతిరిగింది. నాగేంద్రం యినపగరిటెతో గొడ్డును బాదినట్లు బాదాడు. మీనాక్షి శోకాలుబెట్టింది. చుట్టూ ఇళ్ళల్లోవున్న ఆడంగులు మీనా క్షిని ఓదార్చటానికి రాలేదు. పైగా 'ఏం, మాయరోగ మొచ్చిందా... కి... బోగందీ... బోగంవగలు!' అని తమ మొగుళ్ళను గట్టిగా కావిలించుకొని నిశ్చింతగా నిద్ర పొయ్యారు. ఏది ఏమయినప్పటికీ ఆరాత్రి తన అవసరాన్ని మాత్రం తీర్చుకోగలిగాడు నాగేంద్రం. అప్పటికి మీనాక్షికి ఎనిమిదోమాసం నిండింది.

మీనాక్షి దెబ్బలు తినడం ఇది నాలుగోసారి. కారణాలుమాత్రం ఇవే. ఒకసారి కొంచెం తలనొప్పిగా వుంది. అదీ అవ్వేళ మధ్యాన్నం నిద్రపోకపోవడం మూలాన. ఆరాత్రి వొక ఆసామీవొచ్చి రాత్రికి పాతికరూపాయలిస్తానన్నాడు. తల్లి ఎంతో బతిమాలింది. ఆమె ఒప్పుకోలేదు. డాక్టరుచేత ఇంజెక్షను తీసుకొంది తలనొప్పికి. ఇది మీనాక్షి 'కులట'జీవితంలో సంగతి. 'సంసారి' జీవితంలో కొచ్చిన తరవాత ఎనిమిదినెలలగర్భంతో మొగుడికి లొంగిపోలేదని చావతన్నించుకొంది.

# 6

మీనాక్షి నీళ్లాడింది. అప్పటినుండీ ఆమె మంచంలోనించి లేవదు. పిల్లాడికి తల్లిపాలు చాలడంలేదు. అందులో "రోగిగావున్న తల్లిపాలుపట్టడం మహాప్రమాదం" అన్నారు కొంతమంది. పిల్లాడు పూర్తిగా డబ్బాపాలమీద ఆధారపడవలసివొచ్చింది.

"ఎక్కడిడబ్బా? పీడిబొందకే చాలడంలేదు. ఎన్ని పాలడబ్బాలని తేను! యాభయ్‌రూపాయల్లో ఎన్నని సర్దను!" అన్నాడు నాగేంద్రం.

పాలులేక చిక్కిపోతున్న తనకొడుకునిచూచి బావురుమని ఏడ్చింది మీనాక్షి. "ఈ నిర్భాగ్యురాలి కడుపున ఎందుకు పుట్టావురా నాయనా!" అని నాగేంద్రం చూడకుండా శోకాలుబెట్టింది.

మీనాక్షి పూర్తిగా కోలుకొనేటప్పటికి ఆరుమాసా లైంది. అయితే మీనాక్షికిబదులు పసిపిల్లడు జబ్బుపడ్డాడు. డబ్బాపాలు చాలడంలేదు. అవయినా పిల్లాడు ఇముడ్చుకో లేకపోతున్నాడు. కళ్ళు గోతుల్లాగ తయారయినై. చేతులు కాళ్ళు పూచికపుల్లలకంటె హీనం. కడుపుగుమ్మడికాయంత.

"ఇది లివరుజబ్బమ్మా! జమ్మివారిమందు వాడండి, తగ్గిపోతుంది. మొన్న వెంకమ్మత్తకూతురుకు..." అన్నారొకరు.

ఆనాటి రాత్రి నాగేంద్రంతో సంగతి చెప్పింది, మీనాక్షి. "నిజమే పాపం! ఏంచెయ్యమంటావు?" అన్నాడు నాగేంద్రం. మీనాక్షి ఏమీ చెప్పలేదు. గురకపెడుతున్న కొడుకును గుండెకదుముకొని తడికళ్ళుమూసింది.

అర్ధరాత్రప్పుడు పిల్లాడికిబదులు నాగేంద్రం తగిలాడు.

"నేనేలే, ఏదీ ఇట్లాతిరుగు" అన్నాడు నాగేంద్రం మీనాక్షి పొత్తికడుపుకింద తడుముతూ.

"పిల్లాడు" అంది మీనాక్షి లేవబోతూ. నాగేంద్రం మీనాక్షిని లేవకుండా అదిమిపట్టి "రేపొద్దున డాక్టర్ని పిలుస్తాను...ఇందాక అబ్బాయినిచూస్తే నాగుండె తరుక్కు పోయింది" అన్నాడు. మీనాక్షిలోని "మాతృహృదయం" కరిగిపోయింది. తన చిట్టిబాబు ఆరోగ్యంకోసం తనవొంట్లో 'సరి' లేకపోయినా తెల్లవార్లూ నాగేంద్రంచేతుల్లో వొంపులు తిప్పబడింది.

నాగేంద్రం సత్యహరిశ్చంద్రుడు కాడు. కనీసం కృత యుగంలోని మనిషన్నాకాడు (ఆ యుగంలోనివాళ్లు మంచి వారని ఈ రచయిత ఎప్పుడూ అభిప్రాయపడలేదు. అది

రచయిత తప్పుకాదు) అన్నమాట చెల్లించడానికి. అతను సర్వసాధారణమైన మనిషి. మీదుమిక్కిలి పందొమ్మిదో శతాబ్దంవాడు. (ఇది ఇరవయ్యో శతాబ్దమని అనడంఅనుచితం అనే 'శ్రీశ్రీ'తో ఈ రచయిత ఏకీభవిస్తున్నాడు) అంచేత ఆ తెల్లవారి డాక్టర్ని పిలవవలసినఅవసరం నాగేంద్రానికి లేదు.

# 7

పిల్లాడుచచ్చి నెలరోజులు దాటింది. ఈ దిగులువల్ల కుమిలిపోయిన మీనాక్షికి రోగం తిరగబెట్టింది. అంతరోగం తోనూ ఇంటిచాకిరీ చేస్తూనేవుంది. నాగేంద్రం మహా భయస్తుడు. అంచేత రాత్రిళ్ళు వొంటరిగాపడుకోలేడు. రోగంతో మూలుగుతున్నాసరే మీనాక్షిని తోడుజేసుకొని పడుకొంటాడు. అప్పటికిగానీ నాగేంద్రం నిర్భయంగా నిద్రపోలేడు.

ఒకనాటిరాత్రి మీనాక్షి ఎందుకో లేచింది. దీపం సన్నగా వెలుగుతూవుంది. నాగేంద్రం పక్కలోలేడు. బైటికెళ్ళాడేమో ననుకొంది. అరగంటకయినా రాకపోవడంచేత బైటచూద్దామని తలుపుతీయబోయింది. చాలాసేపటికి గానీ బైట గొళ్ళెం పెట్టబడిందని మీనాక్షి తెలుసుకోలేకపోయింది.

ఆ తెల్లవారి నాగేంద్రాన్ని అడిగింది.

"ఆఁ, నీమొఖం ..........కలవరించావేమోలే!" అన్నాడు నాగేంద్రం.

అట్లాంటి కలవరింపులు మీనాక్షి చాలాసార్లు కలవరించింది. ఒక వారంరోజులు పట్టుబట్టిచూసింది. అన్ని

రోజులూ మీనాక్షి ఆవిధంగా కలవరిస్తూనేవుంది. పోతే నాగేంద్రం ఒక అమ్మాయిని 'లవ్' చేశాడని, తనకు రాత్రిళ్ళు పక్కలో నాగేంద్రం లేనట్లు "కలవరింపు"లు రావడానికి ఆ "లవ్వే" కారణమనీ మీనాక్షికి చాలాకాలం దాకా తెలియలేదు.

పాపం ఎక్కువకాలం దాగదు. మీనాక్షికి ఆవిధమైన కలవరింపులు రావడం ప్రారంభించిన రెండుమాసాలకు నాగేంద్రం వొంటినిండా చారెడేసి పొడలు పుట్టినయ్. పదిహేనురోజులు తిరక్కముందే మీనాక్షివొంటిమీదికి ఈ పొడలు పాకడం జరిగింది. నాగేంద్రం "లవ్" చేసిన అమ్మాయి వందరూపాయలు ఖర్చుపెట్టి తన "లవర్" శరీరాన్ని మరామ్మత్తు చేసుకొంది. మీనాక్షిఅవసరం నాగేంద్రానికే పట్టనప్పుడు, నాగేంద్రం"లవర్" కేం అవసరం?

మీనాక్షిపని యిప్పుడు నానా గిజాటుగావుంది. తన శరీరాన్ని నాగేంద్రానికి చూపించి డాక్టర్ని పిలవమని బతిమిలాడింది. అప్పుడు నాగేంద్రం తాగి వున్నాడు. ఆ సంగతి మీనాక్షికి అప్పుడే తెలిసింది.

"...ఇంకా దొంగవగలుపోతావేం? నానా గాడిదలతో తిరిగి అడ్డమైన రోగాలన్నీ వొంటికి పట్టించుకొన్నావ్. అవన్నీ నాకు ఎక్కించి నా ఆరోగ్యం నాశనం చేశావ్. నువ్వసలు భోగం...వి.నా యింట్లోనించి ఫో..." ఈ వరసలో వెళ్ళాడు నాగేంద్రం. ఆఖరికి మీనాక్షిని స్పృహ తప్పేటట్లు తన్ని బైటి కీడ్చాడు.

చుట్టుపక్కల జనం "భోగం...! భోగంవగలూ" అన్నారు.

మీనాక్షి ఒక్కసారి తన పాతజీవితంలోకి తొంగి చూసింది. అదెంత హాయయిన జీవితం! ఎంత డబ్బిచ్చినా నచ్చనివాడైతే తిరస్కరించే ప్రాథమికహక్కు ఆ జీవితంలో దొరుకుతుంది. సర్వసంపూర్ణమైన బతుకు తన కావిలింతకోసం వందలమంది తిరుగుతుంటారు. ఎంతో ఆకర్షణ, వెలుగు, మధురంగా పొంగుతూవుంటుంది. క్షుద్రమైన సంసార జీవితం! మొగుడు నచ్చినా నచ్చకపోయినా నచ్చినట్టు నటించాలి. తన ఆరోగ్యం ధ్వంసమయివున్నా మొగుడి చేతుల్లో ఒంపులు తిరగాలి. తిండికోసం, గుడ్డకోసం, చివరికి జడ రిబ్బనుకోసం మొగుడికి శరీరాన్ని ఒప్పజెప్పిందాకా గతిలేదు. అయితే భోగంవాళ్ళకీ సంసారులకీ ఎక్కడా భేదం? భోగంది వందరూపాయలకు నచ్చినవాడికి శరీరాన్నిఒప్పగిస్తుంది. సంసారస్త్రీ రిబ్బనుకోసం కుళ్లుమొఖంభర్తను కళ్ళు మూసుకొని ఏడుస్తూ భరిస్తుంది.తన కిష్టంలేకపోతే ఆ లోకంలో తిరస్కరించనొచ్చు. "మన సభ్యత" "మన సంస్కృతి" అని బాదబాదలాడే జబ్బలు చరుచుకొనే ఈ లోకంలో ఆడదాని ఇష్టా ఇష్టాలతో నిమిత్తంలేదు. వేడి తగ్గితే సరి.

మీనాక్షి తన మొదటిజీవితంలోకి వెళ్ళాలనుకొంది. "ఉత్తమమైన సంసార రంగం" (? ? ?) మీనాక్షిజీవితాన్ని ధ్వసంచేసింది. ఉన్న సౌందర్యమంతా నాగేంద్రం పీల్చి

కొన్నాడు. పిప్పిని బైటికి గెంటాడు. ఆకర్షణ, కాంతి లేని బతుకు మీనాక్షిది ప్రస్తుతం. ఇక తన ముఖ మెవరు చూస్తారు? తన గతేమిటి?

"భగవంతుడా!" అంది మీనాక్షి చేతులు జోడించి.

భూలోకవ్యవహారాలతో పూర్తిగా తెగతెంపులు చేసుకొన్న భగవంతుడు "నాకెందుకు" అని చప్పగా నిద్ర పోయాడు.